## క్లుప్తంగా

### చలివేంద్రాలు ప్రారంభం



దివాన్‌చెరువులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**రాజానగరం:** వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని బాటసారుల దాహార్తిని తీర్చేందుకు దివాన్‌చెరువులోని నాలుగు ప్రాంతాల్లో చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. మహా గణపతి యువజన సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీటిని స్థానిక ప్రముఖులు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు.

### రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

**రాజానగరం:** దివాన్‌చెరువులోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారని ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్) ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఈ కారణంగా దివాన్‌చెరువు, పాలచర్ల, శ్రీరామపురంల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### పోస్టల్ బ్యాలెట్ సేకరణ

**రాజానగరం:** సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌ని వినియోగించే వారికి ప్రయోజనం చేకూర్చే విధంగా నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం తహసీల్దారు కార్యాయాల వద్ద పోస్టల్ బ్యాలెట్ సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని నియోజకవర్గ రిటరి్నంగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు, మైక్రో అబ్జర్వర్లు తదితర పోలింగ్ సిబ్బంది ఫారం -12ను పూర్తి చేసి, ఎన్నికల విధులకు సంబంధించి ఆర్డర్ నకలు, ఆధార్ నకలు, ఓటరు గుర్తింపు కార్డు నకలుతో పాటు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలను ఈ కేంద్రాల వద్ద అందజేయాలన్నారు.

### అప్రమత్తతోనే అగ్నిప్రమాదాల నివారణ

**అనపర్తి:** అప్రమత్తత, అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యమని అనపర్తి అగ్నిమాపక అధికారి జె.శ్రీనివాసరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం అనపర్తి అగ్నిమాపక సిబ్బంది స్థానిక జీబీఆర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు చేపట్టాల్సిన చర్యలపై ఎస్ఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు వినియోగించే వివిధ పరికరాలను ప్రదర్శించిన అగ్నిమాపక సిబ్బంది వాటి పనితీరును, ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



మిర్తిపాడులో వృద్ధురాలిని పలకరిస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

**సీతానగరం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, పారదర్శక పాలనతో ప్రజలకు మంచి జరిగిందని రాజానగరం ఎమ్మెల్యే, పార్టీ అభ్యర్థి జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. బుధవారం మిర్తిపాడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో స్థానిక ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. ఇంటింటికీ వెళ్లి, ఓటర్లతో మమేకమై నాయకులు, కార్యకర్తలతో ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జక్కంపూడి రాజాను గెలిపించడానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. మహిళలు ప్రతి రంగంలోనూ రాణించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మహిళలు కూడా రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశంతో నామినేటెడ్ పదవుల్లో యాభై శాతం కేటాయించారన్నారు. రాజానగరం నియోజకవర్గంలో రూ.1,773 కోట్లతో అభివృద్ధి, రూ.1,377 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. మిర్తిపాడు గ్రామ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.4.40 కోట్లు ఖర్చు చేశారని వివరించారు. డీబీటీ, నాన్ డీబీటీల రూపంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయలను ప్రజలకు అందజేశారన్నారు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ లాంటి శాశ్వత భవనాలను ఏర్పాటు చేశారన్నారు. మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిచ్చామని, గత ప్రభుత్వ హయాంలో కనీసం పది శాతం కూడా అభివృద్ధి నిధులు మంజూరు చేయలేదన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల కో-కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మల్లిన చౌదరి, జొన్నలగడ్డ సత్యనారాయణ, ఏక రాజు, మాకిరెడ్డి సాయికల్యాణ్, నల్లా శ్రీను, నడిపల్లి హరీష్, సప్పా రాము, జొన్నలగడ్డ సత్య తదితరులు పాల్గొన్నారు.

# జగన్ కోసం జన గోదారి ఎదురుచూపు

- నేడు గోదారి తీరానికి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర
- ఆతృతగా ఎదురు చూస్తున్న గోదావరివాసులు
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం, పార్టీ శ్రేణులు తలమునకలు





ట్రయల్ రన్ కోసం కడియపులంక వచ్చిన సీఎం బస్సు

ఇచ్చిన మాటను నెరవేర్చే వరకూ విశ్రమించని నిరంతర శ్రామికుడు.. అవ్వాతాతలకు.. ఆడబిడ్డలకు.. ఆర్థికంగా వెనుకబడ్డ అన్ని వర్గాలకూ నేనున్నానంటూ అండగా నిలిచిన సంక్షేమ సారథి రాకతో గోదావరి తీరం పులకించనుంది. ముందెన్నడూ ఊహించని రీతిలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి.. తమ జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగు పరిచి.. జన హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం ఇక్కడి ప్రజానీకం ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఆ జననేతను కళ్లారా చూస్తామా అంటూ వేచి చూస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర.. గోదావరి చెంతకు చేరుతుండడంతో గోదావరి వాసుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఐదేళ్ల సమర్థ పాలనతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చేందుకు మేమంతా సిద్ధమంటూనే.. జన నాయకుడికి అపూర్వ స్వాగతం పలికేందుకు సన్నద్ధమయ్యారు. రోడ్ షో కొనసాగే మార్గమంతా జన గోదారి ఉప్పొంగనుంది. ముఖ్యమంత్రి పర్యటనతో అధికార యంత్రాంగం అన్ని విధాలా సన్నద్ధమైంది. ఎన్నికలు ప్రకటించిన తర్వాత తొలిసారి ఇక్కడకు వస్తున్న జన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, కేడర్‌లో ఉత్సాహం ఉవ్విళ్లూరుతోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ పర్యటన వారిలో నూతనోత్తేజం నింపనుంది.

## నేడు రాజమహేంద్రవరంలో సీఎం జగనన్న రోడ్డు షో

- నగరంలో 7 కి.మీ. మేర సాగనున్న యాత్ర
- ఎంపీ భరత్‌రామ్ వెల్లడి



ఎంపీ భరత్‌రామ్

**రాజమహేంద్రవరం సిటీ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా గురువారం రాజమహేంద్రవరంలో రోడ్ షో జరుగనున్నదని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ బుధవారం తెలిపారు. రావులపాలెం పొట్టిలంక మీదుగా గురువారం ఉదయం 12.30 గంటలకు రాజమహేంద్రవరం రూరల్ కడియపు లంకకు చేరుకుంటారన్నారు. అక్కడ మధ్యాహ్న భోజన విరామం అనంతరం వేమగిరి జంక్షన్, బొమ్మూరు జంక్షన్ మీదుగా మోరంపూడి జంక్షన్ నుంచి రాజమహేంద్రవరం సిటీలోకి సీఎం రోడ్డు షో ప్రవేశిస్తుందన్నారు.

ఈ రోడ్ షో వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, తాడితోట జంక్షన్, బైపాస్ రోడ్డు, అశోకా థియేటర్, ఆజాద్ చౌక్, దేవీ చౌక్, గోకవరం బస్టాండు, ఆర్యాపురం, మూలగొయ్యి, సీతంపేట, పేపర్ మిల్లు మీదుగా కాతేరు, దివాన్ చెరువు, రాజానగరం వరకూ రోడ్డు షో కొనసాగనున్నదన్నారు. సిటీ పరిధిలో మొత్తం 7 కిలోమీటర్ల మేర సీఎం జగనన్న రోడ్డు షో కొనసాగుతుందన్నారు. ప్రజలంతా తరలివచ్చి పేదలకు సంక్షేమ పాలన అందిస్తున్న జన నేత జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చే విధంగా ప్రజలు ఆశీర్వదించి, మద్దతు తెలియజేయాల్సిందిగా ఎంపీ భరత్ రామ్ అభ్యర్థించారు.

## జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందాం



పెదరాయవరంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



మిమ్మల్నే గెలిపించుకుంటాం.. డాక్టర్ బాబూ అంటూ భరోసా ఇస్తున్న కల్లుగీత కార్మికుడు

**రంగంపేట:** పేదలకు న్యాయం జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని, అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కోరారు. మండల పరిధిలోని పెదరాయవరం గ్రామంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామానికి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, ఎంపీటీసీ మాచిన మమతారాణి దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. తర్వాత షిరిడి సాయిబాబా ఆలయంలో పూజలు అనంతరం ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయ్యాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు కోసం చంద్రబాబు నాయుడు ఎన్ని అబద్ధాలైనా ఆడతారని దుయ్యబట్టారు. 2014లో ఇదే కూటమి ఎన్నో తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక అన్ని మూట కట్టి మూలన పడేసిందన్నారు. అటువంటి నయవంచకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి సమపాళ్లలో జరగాలంటే వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. పెదరాయవరం ఎస్సీకాలనీకి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి రాగానే ఎస్సీకాలనీ వాసులు, నాయకులు, యూత్ సభ్యులు, అభిమానులు దుశ్శాలువాలు, గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాస రావు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వర రావు, మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, సర్పంచ్ బరగటి సుజాతనాగేశ్వరరావు, ఉప సర్పంచ్ మద్దిపాటి వీర్రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఇనుగంటివారిపేటలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న మదన్‌బాబు దంపతులు



కణుపూరులోని కోదండ రామాలయంలో సీతారాములు



పందలపాకలో కల్యాణం జరిపిస్తున్న సబ్బారపు శ్రీను, లక్ష్మీ దంపతులు



పందలపాకలో వెలంపేట రామాలయంలో సీతారాములు



రాజానగరంలో రావుల చెరువు గట్టున ఉన్న రామాలయం వద్ద నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణోత్సవం

# జగమంతా రామమయం

- అంగరంగ వైభవంగా సీతారాముని దివ్య కల్యాణం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్న సమారాధనలు
- భక్తులతో కిటకిటలాడిన రామాలయాలు



సీతానగరం లంకూరు దక్షిణ రామాలయం వద్ద సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

**రాజానగరం:** సీతారాముల కల్యాణము చూతము రారండి.. అంటూ ఆదర్శ దంపతుల కల్యాణోత్సవాలను భక్తి పారవశ్యంతో తిలకించి, ఆధ్యాత్మికతతో భక్త జనం పులకించిపోయింది. శ్రీరామ నవమి వేడుకలు నియోజకవర్గంలో బుధవారం వాడవాడలా వైభవంగా జరిగాయి. గ్రామగ్రామాన ఉన్న రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల ముంగిట వేసిన తాటాకు పందిళ్లు, మామిడి తోరణాలు, పూల అలంకరణలు, విద్యుద్దీపాలతో రామాలయాలు శోభాయమానంగా దర్శనమిచ్చాయి. స్థానిక రావులచెరువు గట్టున కొలువు తీరిన కోదండ రాముని ఆలయం, అగ్రహారంలోని రామాలయం, ఎస్‌బీఐ రోడ్డులోని కంచుపట్ల రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కల్యాణం అనంతరం భక్తులకు వడపప్పు, పానకాన్ని ప్రసాదంగా అందజేశారు. మండలంలో పురాతన ప్రసిద్ధి చెందిన కానవరంలోని కోదండ రాముని ఆలయంతో పాటు, తోకాడ, ముక్కినాడ, మల్లంపూడి, రాధేయపాలెం, పాత, కొత్త తుంగపాడు, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, యర్రంపాలెం, సంపత్‌నగరం, కొండగుంటూరు, దివాన్‌చెరువు, పాలచర్ల, వెలుగుబంద, సీతారామపురం, నందరాడ, నరేంద్రపురం తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా సాగాయి. ఈ సందర్భంగా పలు రామాలయాల వద్ద అన్న సమారాధనలు కూడా జరిగాయి.

**సీతానగరం:** శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ఆలయాల్లో స్వామివారి కల్యాణం ఘనంగా జరిపారు. సన్నాయి మేళాలు, బాణసంచా కాల్పులు దద్దరిల్లాయి. ఇనుగంటివారిపేట శ్రీశాంతిదుర్గ అమ్మవారి ఆలయం వద్ద గ్రామస్తుల సహకారంతో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు స్వామివారి కల్యాణానికి తలంబ్రాలు, మంచి ముత్యాలు అందించారు. వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌మోహన్‌బాబు, వెంకటలక్ష్మి దంపతులు, వరదా గంగాధరరావు, ఆదిలక్ష్మి దంపతులు కల్యాణం, పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాపాక పంచాయతీలోని శ్రీరామనగరం రామాలయం వద్ద చిరగం వీరబాబు, విజయ దంపతులు, సీతానగరం లంకూరు దక్షిణ రామాలయంలో తోరం శోభనబాబు, సాయి రమాదేవి దంపతులు, వెలమపేట రామాలయంలో దుంగల మురళి దంపతులు స్వామివారి కల్యాణాల్లో పీటలపై కూర్చున్నారు. రఘుదేవపురం పెందుర్తివారి రామాలయం వద్ద స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా చేశారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. రఘుదేవపురం, పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, చినకొండేపూడి, నాగంపల్లి, చీపురపల్లి, కూనవరం, ముగ్గళ్ల, ఇనగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాల్లోని రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

### లోక కల్యాణార్థం స్వామివారి కల్యాణం

**మధురపూడి:** కోరుకొండ మండలంలోని వివిధ రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. మంగళ స్నానాలనాచరించిన స్వామి, అమ్మవార్లు పెండ్లిపీటలపై ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పానకాన్ని వితరణ చేశారు. కణుపూరు, బూరుగుపూడి, గాడాలలోని రామాలయాల్లో, కోరుకొండ కోదండ రామాలయం, నర్సాపురం, దోసకాయలపల్లి, జంబూపట్నం, కాపవరం, బూరుగుపూడిల్లోని రామాలయాల్లో వేడుకలు జరిగాయి.

### 108 లీటర్ల క్షీరాభిషేకం

బూరుగుపూడి బాబా ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా భక్తులకు దుస్తులు పంపిణీ చేశారు. భక్తులు దుద్దిపూడి గంగరాజు, సరోజిని ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. తొలుత మూతిన వసంత కుమార్ దంపతులతో బాబావారికి 108 లీటర్ల క్షీరాభిషేకం జరిగింది.

### వాడవాడలా స్వామివారి కల్యాణోత్సవాలు

**బిక్కవోలు:** శ్రీరామ నవమి సందర్భంగా రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం మండలంలోని పందలపాక వెలంపేట రామాలయం వద్ద సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు గరిమెళ్ళ సత్యప్రకాష్‌రావు ఆధ్వర్యంలో సబ్బారపు శ్రీనివాస్, లక్ష్మి దంపతులు కల్యాణ కర్తగా వ్యవహరించి కమనీయంగా కల్యాణం చేశారు. అనంతరం భారీ ఎత్తున అన్నసమారధన నిర్వహించారు.అనంతరం స్వామివారి జిల్లా మహిళ సంక్షేమ సంఘ చైర్మన్ రొంగల పద్మావతి,అప్పాజి దంపతులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలోని కమీటీ సభ్యులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి

**రంగంపేట:** మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలో గల రామాలయాల వద్ద బుధవారం శ్రీరామనమి కళ్యాణ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోటపాడు రామాలయం వద్ద కల్యాణ మహోత్సవం కొండేపూడి శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.

17 ఎండీపీ 202. కోటపాడు రామాలయం వద్ద సీతారాముల కల్యాణం తిలకిస్తున్న భక్తులు.



జి.మామిడాడ రాముల వారి కల్యాణంలో చిన్నారి వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం



రాముల వారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

## కోదండరాముని దర్శించుకున్న ఎమ్మెల్యే



జి.మామిడాడ కోదండ రామాలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు

**పెదపూడి:** జి.మామిడాడ గ్రామంలో అంగరంగ వైభవంగా శ్రీ కోదండరాముడు సీతాదేవి కల్యాణం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. పట్టు వస్త్రాలు సమర్పించారు. సుమారు 2 గంటల పాటు జరిగిన రాముల వారి కల్యాణం భక్తులు కనులారా తిలకించి పరవశమయ్యారు. ఎమ్మెల్యే దంపతులకు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దంపతులు వెంట ఎంపీపీ కేతా తులసి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఉప సర్పంచి మేడపాటి తాతారెడ్డి, వైస్ ఎంపీపీ పద్మ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మండ రాజారెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సూక్ష్మ కళాకారుడు, పీఈటీ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి బియ్యం గింజలపై శ్రీరామ రామ నామాలు రాసిన బియ్యాన్ని, స్వామివారికి సమర్పించగా వాటిని కల్యాణంలో వినియోగించారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులకు ఆలయంలో అర్చకులు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఉచితంగా చేతి విసిన కర్రలు అందించారు. కోనేరు వద్ద భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, యూత్, స్వచ్ఛంద సేవాసంస్థల వారు ఏర్పాటు చేసిన పాలు, మజ్జిగా మంచి నీళ్ల కేంద్రాన్ని ప్రముఖులు ప్రారంభించారు. పలువురు చలివేంద్రాలు ఏర్పాటు చేసి, చిన్న పిల్లలకు పాలు, బిస్కెట్లు, మజ్జిగ, తాగునీరు, పుచ్చకాయ ముక్కలు పంపిణీ చేశారు. పెదపూడి ఎస్సై శోభన్‌కుమార్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, పది మంది ఏఎస్ఐ, 50 మంది పోలీసులు భారీ బందో బస్తు నిర్వహించారు.

## కమనీయం.. సీతారాముల కల్యాణం



పీరారామచంద్రపురంలో జరిగిన వేడుకల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



పాతవూరు రామాలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు



రామవరంలో భక్తులకు పానకం పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

**అనపర్తి:** మండలంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న రామాలయం, జీబీఆర్ కళాశాల వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం, పల్లీల రామాలయం, పాతవూరు సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి రామాలయం, కమ్మవారి రామాలయం, బాపనమ్మ గుడి వీధిలోని శెట్టిబలిజ రామాలయం, బాపిరాజు గారి రామాలయంలో, నల్లకాలువ వంతెన సమీపంలో గల రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని కొప్పవరం వెలమపేట, రెడ్డీస్ రామాలయం, పొలమూరు గ్రంథాలయం వద్ద వేంచేసివున్న లక్ష్మణ, హనుమత్, సీతా సమేత కోదండ రామచంద్రస్వామి, రామవరం పడమట వీధిలోని రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పొలమూరు, పీరారామచంద్రపురం గ్రామాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. సీతారాముల కల్యాణం సందర్భంగా రామవరం పడమట వీధిలోని ఆలయంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి తనయుడు దివంగత సబ్బెళ్ల సురేష్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి ఆధ్వర్యంలో భక్తులకు బెల్లం పానకం పంపిణీ చేశారు. మండలంలోని కుతుకులూరు, పులుగుర్త, పెడపర్తి, దుప్పలపూడి, మహేంద్రవాడ, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు.